## జగిత్యాల జేఎన్టీయూ కళాశాలకు యూనివర్సిటీ హోదా అవకాశాలు

**మల్యాల, న్యూస్‌టుడే:** జిల్లాలోని నాచుపల్లి జేఎన్టీయూ కళాశాలకు యూనివర్సిటీ హోదా కల్పించే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని జేఎన్టీయూ తొలి మహిళా రిజిస్ట్రార్ డా. జయలక్ష్మి అన్నారు. మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్న తర్వాత విలేకరులతో మాట్లాడుతూ..



**అంజన్న ఆలయంలో జేఎన్టీయూ రిజిస్ట్రారు డా.జయలక్ష్మి పూజలు**

నాచుపల్లి జేఎన్టీయూ కళాశాలకు యూనివర్సిటీ హోదా లభించేందుకు త్వరలో ఎంబీఏ, బీటెక్, బయోటెక్ కోర్సులు ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ జేఎన్టీయూ క్యాంపస్ తర్వాత జగిత్యాల కళాశాలకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. మారుతున్న సాంకేతికత, ఏఐకు అనుగుణంగా ఉపకులపతి నేతృత్వంలో విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడానికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. టీసీఎస్ కంపెనీ సహకారంతో మంథనిలో చేపట్టిన ప్రయోగాత్మక ప్రాజెక్టును జగిత్యాలతో పాటు ఇతర అనుబంధ కళాశాలల్లో కూడా విస్తరించనున్నట్లు వెల్లడించారు. జేటీపీఐ, ఎంఎస్ఎంఈ సంస్థల సహకారంతో రోబోటిక్స్, ఏఆర్/వీఆర్, ఎలక్ట్రిక్ వాహనాల సాంకేతికపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

**ఆధునిక ప్రయోగశాలలు**

బజాజ్ సంస్థ అందించిన రూ.20 కోట్ల సామాజిక బాధ్యత నిధులతో హైదరాబాద్‌లో ఏర్పాటుచేస్తున్న ఆధునిక ప్రయోగశాలలు వచ్చే జనవరి నాటికి ప్రారంభమవుతాయన్నారు. ఆ ల్యాబ్‌ల్లో జగిత్యాల జేఎన్టీయూ విద్యార్థులకు కూడా శిక్షణ అవకాశం కల్పిస్తామని వివరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రిజిస్ట్రార్‌తోపాటు, జేఎన్టీయూ ప్రిన్సిపల్, ఆచార్యులను స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి ఆశీర్వదించారు. నాచుపల్లి జేఎన్టీయూను యూనివర్సిటీగా మార్చాలని కోరుతూ మల్యాల సర్పంచి జయ జేఎన్టీయూ రిజిస్ట్రార్ జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

## కొండగట్టులో జేఎన్టీయూ రిజిస్ట్రార్ పూజలు

మల్యాల, అక్టోబర్ 13: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో ఆలయ ఈవో అంజనారెడ్డి, స్థానాచార్యులు కపీందర్ నేతృత్వంలో వారికి ఘన స్వాగతం పలికి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ప్రాకార మండపంలో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేయగా, వేదమంత్రోచ్ఛరణల మధ్య వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయం వెలుపల రిజిస్ట్రార్ జయలక్ష్మి మాట్లాడుతూ, కొండగట్టు-నాచుపల్లి జేఎన్టీయూని సైతం హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అత్యాధునిక ల్యాబ్‌లను సైతం విద్యార్థులకు వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కాలేజీని సైతం యూనివర్సిటీకి దీటుగా అభివృద్ధి చేస్తామని, భవిష్యత్‌లో ఎంబీఏ కోర్సును ప్రవేశపెడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

కొడిమ్యాల, అక్టోబర్ 13: విద్యార్థులు చదువుతో పాటు యూనివర్సిటీలో అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని జేఎన్టీయూ రిజిస్ట్రార్ జయలక్ష్మి సూచించారు. నాచుపల్లి జేఎన్టీయూలో మంగళవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ మంగళవారం రెనైసాన్స్ ఫ్రెషర్స్ -2కే26 పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జేఎన్టీయూ రిజిస్ట్రార్ జయలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ ముఖ్యమన్నారు. విద్యతో పాటు విలువలు, నిజాయతీ అవసరమన్నారు. విద్యార్థులు మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. జేఎన్టీయూ పరిధిలో ఉమ్మడి ప్లేస్‌మెంట్ వేదికను ఒకే చోట ఏర్పాటు చేసి, సాయంత్రం హాస్టల్ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ శిక్షణ కోర్సులు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ, రాజన్న సిరిసిల్ల జిల్లా జేఎన్టీయూ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



**జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేఎన్టీయూ రిజిస్ట్రార్ జయలక్ష్మి**

## హైదరాబాద్‌కు దీటుగా కొండగట్టు జేఎన్‌టీయూ

**● జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయలక్ష్మి**

మల్యాల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో కొండగట్టు-నాచుపల్లి జేఎన్‌టీయూ కళాశాలను హైదరాబాద్ ప్రధాన క్యాంపస్‌కు దీటుగా తీర్చిదిద్దనున్నట్లు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయలక్ష్మి తెలిపారు. కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విద్య, అత్యాధునిక వసతులతో ఉత్తర తెలంగాణ విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నాచుపల్లి క్యాంపస్‌కు యూనివర్సిటీ హోదా కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు. త్వరలోనే ఎంబీఏ వంటి కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పరిశ్రమల స్థాయి శిక్షణ అందించేందుకు టీసీఎస్ సంస్థతో మంథని జేఎన్‌టీయూలో అమలు చేస్తున్న ప్రయోగాత్మక ప్రాజెక్టును కొండగట్టు-నాచుపల్లి జేఎన్‌టీయూతో పాటు ఇతర అనుబంధ కళాశాలలకు విస్తరించనున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు.



జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

● నాచుపల్లి జేఎన్‌టీయూ కళాశాలను యూనివర్సిటీగా విస్తరించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయలక్ష్మికి మల్యాల సర్పంచ్ బొట్ల జయప్రసాద్‌తో పాటు పలువురు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.